వేతన వెతలు

గ్రామీణ వ్యవసాయ కూలీలకు ఊతం ఇచ్చే ఉపాధి పనులు చేసిన వారికి నాలుగు నెలలకు పైగా వేతన చెల్లింపులు నిలిచిపోయాయి. దీంతో కూలీలు జీవనానికి కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పస్తులతో బతుకు ఈడ్చాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- నాలుగు నెలలకు పైగా పెండింగ్‌లో ఉపాధి బిల్లులు
- ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కూలీల ప్రదక్షిణలు
- వలసలే శరణ్యమని ఆవేదన



లేపాక్షి ఎంపీడీఓ కార్యాలయం

లేపాక్షి: గ్రామీణా ప్రాంతాల్లోని కూలీలు వలసలు పోకుండా నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ ఉపాధి హామీ పథకం లక్ష్యం నీరుగారిపోతోంది. కూలీలకు పనులు కల్పించడంతో పాటు వారికి సక్రమంగా బిల్లులు పడేలా చూడాల్సిన బాధ్యతల అధికారులపై ఉంది. అయితే ఉపాధి కూలీలు పనులు చేస్తున్నప్పటికీ బిల్లులు మంజూరు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో ఒక్కో ఉపాధి కూలీకి 20 నుంచి 23 వారాల వరకు బిల్లులు రావాల్సి ఉంది. బిల్లులు కోసం ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ ప్రదక్షణ చేస్తున్నారు. కార్యాలయాల వద్దకు వెళ్లినప్పుడల్లా ఏదో ఒక సాకు చెప్పి పంపిస్తున్నారే తప్ప బిల్లులు మాత్రం పడడం లేదని కూలీలు వాపోతున్నారు. బిల్లులు సకాలంలో అందకపోతే వలసలే శరణ్యమని వాపోతున్నారు.

6,484 జాబ్‌కార్డులు

లేపాక్షి మండల వ్యాప్తంగా 6,484 జాబ్‌కార్డులు ఉండగా 1200 నుంచి 1500 మందికి పైగా పనులు చేస్తున్నారు. అయితే అన్‌సీజన్ కావడంతో 500 నుంచి 700 మంది దాకా పనులు చేస్తున్నారు. ఇప్పటికే 600 మంది కూలీలకు బిల్లులు రావాల్సి ఉంది. అధికారులు స్పందించి బిల్లులు సకాలంలో కూలీలకు చెల్లించి వారి జీవనం సజావుగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

వలసలే శరణ్యం



ఉపాధి హామీ పథకం కింద పనికి వెళితే తప్ప జీవనం గడవని పరిస్థితి. రోజూ ఉపాధి పనులకు వెళుతున్నప్పటికీ సకాలంలో బిల్లులు పడడం లేదు. ఇప్పటి వరకూ నాకు 24 వారాలు బిల్లు రావాల్సి ఉంది. ఇంట్లో జీవనానికి ఇబ్బందిగా మారింది. కూలీలంతా వలసలు పోవడానికి సిద్ధంగా ఉన్నారు.
– శివప్ప, ఉపాధి కూలి, కొండూరు

బిల్లుల కోసం తిరుగుతున్నా..



రోజూ ఉపాధి పనులకు వెళుతున్నాను. అయితే 23 వారాల బిల్లులు రావాల్సి ఉండగా ఒక్క బిల్లు కూడా పడలేదు. బిల్లులు కోసం ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయింది. బిల్లులు అందక పోవడంతో జీవనం జరగడం చాలా కష్టంగా మారింది.
– గోవిందప్ప, ఉపాధి కూలి, వడ్డిపల్లి

ఏం తిని బతకాలి?



22 వారాలుగా ఉపాధి బిల్లులు రాకపోతే నా కుటుంబం ఏం తిని బతకాలి. ఎలా ఉపాధి పనులకు వెళ్లాలి? సకాలంలో బిల్లులు చెల్లిస్తే పనులు చేయడానికి ఉత్సాహం ఉంటుంది. ఉపవాసం ఉండి పనులు చేయలేకపోతున్నాము. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే మంజూరు చేయాలి.
– పరనప్ప, ఉపాధి కూలి, కొండూరు

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి


రంగప్ప మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న టీఎన్ దీపిక

చిలమత్తూరు: హిందూపురం పట్టణంలోని 38వ వార్డు సింగిరెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రంగప్ప అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త టీఎన్ దీపిక సింగిరెడ్డిపల్లి వెళ్లి రంగప్ప మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రంగప్ప మృతి పార్టీకి తీరని లోటు అని ఆమె పేర్కొన్నారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ అన్ని విధాలా తోడుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆమె వెంట బాలాజీ మనోహర్, నాయకులు బండి రాము, శివారెడ్డి, మనోజ్ గౌడ్, నరసింహారెడ్డి, నాగిరెడ్డి, ముశ్వీర్, ముజ్జు, అన్నూభాయ్, రఫిక్, అభుజప్ప, హరి తదితరులు సమన్వయకర్త వెంట ఉన్నారు.

వివిధ సమస్యలపై నాలుగు అర్జీలు

పెనుకొండ రూరల్: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. డివిజన్ వ్యాప్తంగా వివిధ సమస్యల పరిష్కారానికై నాలుగు అర్జీలు అందినట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు.

క్లుప్తంగా

బాధిత కుటుంబాలకు పరామర్శ


బాషా భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఉషశ్రీచరణ్

పెనుకొండ రూరల్: పట్టణంలోని దర్గా పేటకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మహబూబ్‌బాషా (60) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ మృతుడి నివాసానికి చేరుకొని బాషా భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అలాగే ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సాధిక్ నివాసానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట పట్టణ, మండల కన్వీనర్లు నరసింహా, సుధాకర్‌రెడ్డి, నాయకులు యాసిన్, గణప్ప, శేషాద్రి, బాబు, శ్రీరాములు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలు, బార్లు బంద్

హిందూపురం టౌన్: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు హిందూపురం ఎక్సైజ్ పరిధిలో 3న (బుధవారం) సాయంత్రం 5 గంటల నుంచి 5న (శుక్రవారం) ఉదయం 10 గంటల వరకూ పట్టణ పరిధిలోని మద్యం దుకాణాలు, బార్లను మూసి వేయాలని ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య సూచించారు. ఈ నెల 4న పట్టణంలోని గణేశ్ నిమజ్జనం సందర్భంగా ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. ఎవరైనా అక్రమంగా మద్యం దుకాణాల వద్ద, బార్ల వద్ద మద్యం విక్రయాలు జరిపినా, కర్ణాటక రాష్ట్ర మద్యంతో దొరికినా, అమ్మినా, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్రికెట్ టోర్నీ విజేత 'తమ్మడేపల్లి ఏడీబీస్'


కప్‌తో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న తమ్మడేపల్లి ఏడీబీస్ జట్టు సభ్యులు

అమరాపురం: మండల పరిధిలోని తమ్మడేపల్లి పంచాయతీ దేవగానపల్లిలో నిర్వహించిన పంచాయతీ క్రికెట్ స్థాయిలో తమ్మడేపల్లి ఏడీబీస్ విజేతగా నిలిచింది. దేవగనాపల్లి గణేష్ ఉత్సవాల సందర్భంగా క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఇందులో పది జట్లు పాల్గొన్నాయి. సోమవారం ఫైనల్ మ్యాచ్‌లో జీడీకే సోల్జర్స్ – తమ్మడేపల్లి ఏడీబీస్ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన జీడీకే సోల్జర్ జట్టు నిర్ణీత 6 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 45 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన తమ్మడేపల్లి ఏడీబీస్ జట్టు వికెట్ నష్టపోకుండానే 4.3 బంతుల్లోనే లక్ష్యాన్ని పూర్తి చేసింది. అనంతరం గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు విజేత జట్టుకు రూ.10 వేల నగదుతో పాటు ట్రోఫీ అందజేశారు. రన్నరప్ జట్టుకు రూ.5 వేలు నగదును అందించారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన క్రీడాకారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పెనుకొండ: అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు, వైస్ ప్రిన్సిపాల్ జయప్ప ఓ ప్రకటనలో తెలిపారు. కామర్స్–1, గణిత శాస్త్రం –1, వృక్ష శాస్త్రం–1, హిస్టరీ–1 సబ్జెక్టుల్లో బోధన నిమిత్తం గెస్ట్ లెక్చరర్లు అవసరమన్నారు. ఈ నెల 6వ తేదీ లోగా కళాశాల కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 8న కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు.

పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడికి సన్మానం


ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

లేపాక్షి: మండలంలోని కొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన పీఎస్ ప్రసాద్‌ను సోమవారం ప్రధానోపాధ్యాయుడు శేషగిరిబాబుతో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఎంఈఓలు నాగరాజు, కుళ్లాయప్ప మాట్లాడుతూ ప్రసాద్ 35 సంవత్సరాల సుదీర్ఘ ప్రస్థానాన్ని గుర్తు చేసుకుని ఆయన సేవలను కొనియాడారు. విద్యార్థులకు క్రమశిక్షణ, మెరుగైన విద్య, పట్టుదల తదితర విషయాలను బోధించారన్నారు. అనంతరం ఆయనకు పూలమాలలు వేసి శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓలు గోపాల్ పాల్గొన్నారు.

కేసును ఎన్‌ఐఏకు అప్పగించండి


ధర్నాలో పాల్గొన్న ధర్మస్థల సంఘాల భక్తులు

పావగడ: భక్తుల ఇలవేల్పు అయిన మంజునాథస్వామి కొలువు తీరిన ధర్మస్థల ఆలయానికి కళంకం తెచ్చేలా కొందరు సామాజిక మాధ్యమాల్లో అసత్య ఆరోపణలు చేస్తున్నారు. వెంటనే బాధ్యులైన గిరీశ్ మట్టిన్నవర, మహేశ్ తిమ్మరొడ్డి, టి జయంత్, ఎండీ సమీరను అరెస్ట్ చేయాలి. అని మాజీ ఎమ్మెల్యే కేఎం తిమ్మరాయప్ప డిమాండ్ చేశారు. ప్రభుత్వం నియమించిన సిట్ బృందం దర్యాప్తు నత్తనడకన సాగుతోందని, వెంటనే కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఐఏకు కేసు అప్పగించాలన్నారు. సోమవారం స్థానిక తాలూకా కార్యాలయం ఎదుట వేలాది మంది ధర్మస్థల సంఘాల మహిళా సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. తొలుత గురుభవన్ మైదానంలో ధర్మ స్థల భక్తుల ధర్నాను స్థానిక మాజీ మంత్రి వెంకటరమణప్ప ప్రారంభించారు. అనంతరం మహిళా భక్తులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. తాలూకా కార్యాలయం ఎదుట ప్రధాన రోడ్డులో రాస్తారోకో చేశారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడిపై దాడి

పరిగి: మండలంలోని మోదాలో సోమవారం రాత్రి జరిగిన వినాయక నిమజ్జన వేడుకల్లో భాగంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు నరేంద్రపై టీడీపీ నాయకులు దాడి చేశారు. రాయితో ముఖంపై బాదడంతో నరేంద్ర తీవ్రంగా గాయపడ్డారు. దీంతో హుటాహుటిన అతన్ని హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. టీడీపీ నాయకులు తనపై కక్షపూరితంగా దాడి చేసి గాయపరిచారని, పోలీసులు వెంటనే స్పందించి న్యాయం చేయాలని బాధితుడు నరేంద్ర డిమాండ్ చేశారు.


హిందూపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న నరేంద్ర

అలరించిన చెక్కభజన


చెక్కభజన నిర్వహిస్తున్న దృశ్యం

రొద్దం: మండల కేంద్రంలోని బస్‌స్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన మట్టి గణపయ్య విగ్రహం వద్ద ఆదివారం రాత్రి వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన చిన్నారుల చెక్కభజన అందరినీ అలరించింది. చెక్కభజన గురువు చంద్రను కమిటీ సభ్యులు అభినందించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై నిర్లక్ష్యం వద్దు


మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మంజువాణి

మడకశిరరూరల్: గ్రామాల్లో సీజనల్ వ్యాధులను నిర్లక్ష్యం చేయకుండా వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి పేర్కొన్నారు. సోమవారం ఆమె కల్లుమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. మందుల గదిని పరిశీలించి రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. రోజూ ఎంత మంది రోగులు పీహెచ్‌సీకి వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. మందుల కొరతపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో సమీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వర్షాలు పడుతుండడంతో గ్రామాల్లో పర్యటిస్తూ ప్రబలుతున్న వ్యాధులకు వైద్య చికిత్సలు అందించడంతో పాటు దోమల నివారణ, పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జ్వరాలు సోకితే వెంటనే ఆస్పత్రికి వచ్చేలా చూడాలన్నారు. పీహెచ్‌సీకి వచ్చిన వారికి సకాలంలో చికిత్స అందించాలన్నారు. వైద్య చికిత్సలో ఏ మాత్రం నిర్లక్ష్యం చేయొద్దన్నారు.

మద్యం మత్తులోనే ప్రమాదం !


మారుతి (ఫైల్)

పరిగి: మండలంలోని పెద్దిరెడ్డిపల్లిలో ఆదివారం వినాయక నిమజ్జనోత్సవంలో ట్రాక్టర్ దూసుకెళ్లి వ్యక్తి చనిపోయిన ఘటన డ్రైవర్ మద్యం సేవించి వాహనం నడపడం వల్లే జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన గంగప్ప అనే వ్యక్తి ట్రాక్టరును నడుపుతున్నాడు. ట్రాక్టర్ ముందుకు వెళ్తున్న క్రమంలో బ్రేకు వేయడానికి బదులు క్లచ్‌ను తొక్కడంతో ముందున్న వారిపై ట్రాక్టరు దూసుకెళ్లింది. ఈ ఘటనలో మారుతీ అనే యువకుడు చనిపోగా... మరో ఏడుగురు గాయాలపాలైన విషయం పాఠకులకు తెలిసిందే. నిమజ్జనోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని అధికారులు శాంతి కమిటీ సమావేశాల్లో తెలిపినప్పటికీ ఇలా నిర్లక్ష్యంగా వాహనం నడపడంతో ప్రజల ప్రాణాల మీదకొచ్చిందని మృతుని బంధువులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ గంగప్పపై మృతుడు మారుతీ భార్య మంజుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రంగడుయాదవ్ తెలిపారు. మృతుడికి భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. మారుతీ కొన్నేళ్లుగా మగ్గం నేత కార్మికుడిగా పని చేసి ఇటీవలే కొడిగెనహళ్లి పంచాయతీ కార్యాలయంలో వాటర్‌మెన్‌గా విధుల్లో చేరినట్లు తెలిసింది. మృతుడి కుటుంబ సభ్యులకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు బీఆర్ నారాయణ నగదు సాయం అందజేశారు.

వైభవంగా గణేశ్ నిమజ్జనం


వీరాపురంలో గణనాథుడ్ని తీసుకెళ్తున్న భక్తులు


అమరాపురం మండలం మద్దనకుంటలో..

అమరాపురం: మండలంలోని వీరాపురం, మద్దనకుంట గ్రామంలో గణనాథుల నిమజ్జనోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా ఉదయం నుంచే స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ట్రాక్టర్లలో కూర్చొబెట్టి డీజే పాటలతో ఊరేగింపుగా స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు.

పరిగి: మండలంలో వినాయక వేడుకల సందర్భంగా నిర్వహిస్తున్న నిమజ్జనోత్సవాలు ముగింపు దశకు చేరాయి. మండలంలోని అన్ని పంచాయతీల్లో సోమవారంతో నిమజ్జన వేడుకలు పూర్తి కాగా కొడిగెనహళ్లి, కోనాపురం తదితర గ్రామాల్లో మంగళవారంతో పూర్తి కానున్నాయి. ఎస్‌ఐ రంగడుయాదవ్ నేతృత్వంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నిమజ్జన వేడుకలకు సహకరించిన పోలీసులు, ట్రాన్స్‌కో, రెవెన్యూ సిబ్బందికి ఆయా గ్రామాల ప్రజలు, వినాయక నిమజ్జనోత్సవ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పరామర్శ

పెనుకొండ రూరల్: మండలంలోని రాంపురం పంచాయతీ హనుమపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బోయ నరసింహ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ సోమవారం హనుమపల్లికి వెళ్లి నరసింహను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆమె వెంట పట్టణ, మండల కన్వీనర్లు బోయ నరసింహా, సుధాకర్‌రెడ్డి, మాజీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి, వైశాలి జయశంకర్‌రెడ్డి, నారాయణ యాదవ్, వెంకటేష్, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ టీచర్లకు సన్మానం

రొళ్ల: మండల పరిధిలోని రొళ్లగొల్లహట్టి ప్రాథమిక పాఠశాలలో తొమ్మిదేళ్లుగా పని చేస్తు బదిలీపై వెళుతున్న హెచ్‌ఎం ప్రవల్లిక, ఉపాధ్యాయుడు శరత్‌బాబును సిబ్బందిని ఘనంగా సన్మానించారు. సోమవారం పాఠశాల ఆవరణలో బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను తోటి ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు శాలువా, పూలమాలలతో సత్కరించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీధర్, ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించండి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న స్వామి జపానంద

పావగడ: బానిసగా కాకుండా బాస్‌గా పని చేస్తూ సత్తా నిరూపించుకోవాలని స్థానిక రామకృష్ణ సేవాశ్రమాధిపతి స్వామి జపానంద ప్రభుత్వ ఉద్యోగులకు సూచించారు. స్థానిక ఎస్‌ఎస్‌కే రంగ మందిరంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ సభ్యుల పదవీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో జరిగింది. స్వామి జపానందతో పాటు స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వి వెంకటేశ్ మాట్లాడుతూ నీతి నిజాయతీగా పని చేసి ప్రజలకు నిరంతరం సేవలందించాలని పేర్కొన్నారు. కర్ణాటక రాజ్య ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సీఎస్ షడక్షరి మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రవి కుమార్ పని తీరును ప్రశంసించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులను సన్మానించారు.

నేడు వైఎస్సార్ వర్ధంతి

సాక్షి బృందం: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని మండల కేంద్రాల్లో నిర్వహించనున్నారు. వైఎస్సార్‌సీపీ విగ్రహాల వద్ద మంగళవారం ఉదయమే నివాళులర్పించే కార్యక్రమం ఉంటుందని ఆయా మండలాల వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అలాగే విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

ఏకదంతం.. అనేక రూపం



వెన్న అలంకరణలో వినాయకుడు


సూర్యప్రకాశ సింహాసనధారిగా మహాగణపతి


నింకంపల్లిలో గోపాలకృష్ణుడిగా..


సత్యనారాయణపేటలో కాళీమాత ఖడ్గధారి గణపతి


పార్వతీదేవి ఒడిలో బొజ్జ గణపయ్య


కోట ఏరియాలో భూకైలాస్ నాటిక ప్రదర్శన

హిందూపురం: పట్టణంలో వినాయక ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వాడవాడలా కొలువుదీరిన బొజ్జ గణపయ్య భక్తుల పూజలను అందుకుంటున్నాడు. గణపతి మంటపాల వద్ద నిత్యపూజలతో ఉదయం నుంచి రాత్రి వరకూ భజనలు, ఆటపాటలు, తీర్థప్రసాదాల పంపిణీ సాగుతోంది. పెద్ద ఎత్తున అన్నదానాలను కూడా నిర్వహిస్తున్నారు.


కోట ఏరియాలో నేమలి వాహనధారిగా..